# "నీవు దేవుని రాజ్యమునకు దూరముగా లేవు"[1]

## (మార్కు 12:28-34)

క్రీస్తు ప్రభువు యొక్క భూనివాస కాలపు పరిచర్యలో చివరి వారంలోని మంగళవారం ప్రశ్నలతో కూడిన గొప్ప దినమైయుంది.[2] ఆయన శత్రువులలో ఒకరి తరువాత ఒకరు ప్రశ్నలతో ఆయనను శోధింపవచ్చారు. తన విరోధులు ఆ దినమున అడిగిన ప్రశ్నలలో కడపటి దానిపై ఈ ప్రసంగం చేయబడింది.

ప్రభువును ఉచ్చులోనికి లాగడమే ఈ ప్రశ్నల వెనుక పరిసయ్యుల లక్ష్యమైనట్టుగా (మత్తయి 22:34-40) తెలుస్తుంది. తరువాత ఏమి అడగాలో తెలియక సతమత మయ్యారు. మరొక ప్రశ్న తోచిన తరువాత దానిని ఎవరు అడగాలని ఆలోచిస్తున్నట్టున్నారు. ఎదురుగా నిలిచి, యేసువైపు చూస్తూ, యెరూషలేములోని తెలివైనవాడు కన్పిస్తే, "యితడు మొనగాడు, ఇతనిచేత మన ప్రశ్న అడిగిద్దామనే తీర్మానానికి వారు వచ్చి చేరుకున్నట్టున్నారు."[3] వారు ఇతని విషయమై ఎరుగని సంగతి ఏమంటే సద్దూకయ్యులకు ప్రభువు యిచ్చిన జవాబుతో అతడు మిక్కిలి సంతుష్టి చెందాడనేదే (మార్కు 12:28ఎ; లూకా 20:39 చూడు).

## అప్పుడు - దేవుని రాజ్యమునకు దూరముగాలేవు

### శాస్త్రి ప్రశ్న

ఈ మనిషిలో ఉండిన ఒక ప్రత్యేకమైన గుణగణాన్ని మార్కు రచన బయలు పరచుతుంది – క్రీస్తు మెచ్చుకున్న గుణలక్షణములు. "శాస్త్రులలో ఒకడు వచ్చి వారు తర్కించుట విని, ఆయన వారికి బాగుగా ఉత్తరమిచ్చెనని గ్రహించి – ఆజ్ఞలన్నిటిలో ప్రధానమైనదేదని ఆయననడిగెను" (మార్కు 12:28).

రబ్బీలు పాతనిబంధన ఆజ్ఞలన్నిటిని లెక్కించి, వాటిని 613 అని తేల్చారు, వీటిలో **మొదట** మూడు వంతులు చేయకూడనివనియు, అయిదింట రెండువంతులు చేయవలసి నవియునై ఉన్నాయి. ఇవన్నీ గుర్తుంచుకొనడం కష్టం గనుక కీలకమైన కొన్ని ఆజ్ఞలమీదనే దృష్టి నిలిపి మిగిలినవాటిని వాటితో కలపడానికి వారు చూచారు. తప్పు ఒప్పులనే ప్రశ్నలను నిర్ణయించడం వారికి సులభంగా ఉంది. అందును బట్టి, "ఆజ్ఞలన్నిటిలో ఏది గొప్పది" అని ప్రశ్నిస్తున్నారు.

### క్రీస్తు జవాబు

ప్రభువు ముందే ఈ ప్రశ్నను ఎదుర్కొన్నారు (లూకా 10:25-28) - జవాబు యింతలో మారిపోలేదు. ఆయన యిలా బదులిచ్చారు: "ప్రధానమైనది ఏదనగా - ఓ ఇశ్రాయేలూ; వినుము; మన దేవుడైన ప్రభువు అద్వితీయ ప్రభువు. నీవు నీ పూర్ణ హృదయముతోను, నీ పూర్ణాత్మతోను, నీ పూర్ణ వివేకముతోను, నీ పూర్ణబలముతోను, నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలె ననునది ప్రధానమైన ఆజ్ఞ" (మార్కు 12:29, 30). క్రీస్తు ప్రభువు ద్వితీయోపదేశకాండము 6:4, 5నుండి కోట్ చేశారు.

ప్రశ్నించేవాడు రెండవ ప్రధానమైన ఆజ్ఞ ఏమని అడుగలేదు, కాని ప్రభువు దానిని కూడ యిచ్చారు: "రెండవది, నీవు నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమింపవలెననునది రెండవ ఆజ్ఞ" (మార్కు 12:31ఏ). ఇది లేవీయకాండం 19:18నుండి తీయబడింది. ప్రభువు దీనిని యిలా ముగించారు "వీటికంటే ముఖ్యమైన ఆజ్ఞ మరేదియు లేదని అతనితో చెప్పెను" (మార్కు 12:31బి).

### శాస్త్రియొక్క ప్రత్యుత్తరం

ప్రభువు సమాధానమిచ్చిన మీదట నడచిన ఉత్తర ప్రత్యుత్తరాల మీద మన దృష్టిని నిలుపగోరుతున్నాం. ఆనాటి మంగళవారం క్రీస్తు తన శత్రువుల ప్రశ్నలకు సమాధాన మిచ్చాక వారు తమను తాము సమర్థించుకోడానికి యత్నించలేదు, నిశ్శబ్దంగా ఉండి పోయారు. ఈ ప్రశ్నను అడిగిన శాస్త్రి ఈ రెంటినీ చేయలేదు:

> ఆ శాస్త్రి - బోధకుడా, బాగుగా చెప్పితివి; ఆయన అద్వితీయుడనియు, ఆయన తప్ప వేరొకడు లేడనియు నీవు చెప్పిన మాట సత్యమే. పూర్ణ హృదయముతోను, పూర్ణవివేకముతోను, పూర్ణబలముతోను, ఆయనను ప్రేమించుటయు సర్వాంగ హోమములన్నిటి కంటెను, బలులకంటెను అధికమని ఆయనతో చెప్పెను (32, 33 వచనాలు).

పాత నిబంధన కేవలం బాహ్య సంబంధమైన విషయాలను గూర్చియే అక్కర కలిగి యుంటుందనే భావన కొన్నిసార్లు కలుగుతుంది. ఆలాటి చట్టాలను గూర్చి కొంతవరకు నొక్కి చెప్పిన మాట వాస్తవమే. అయినా, పాతనిబంధన హృదయాన్ని గూర్చి కూడ నొక్కి చెప్పింది (1 సమూ. 16:7; సామె. 23:7; యెహెజ్కేలు 18:31). దేవునికి విధేయత హృదయంలోనుండి రావాలి, లేకుంటే అది అంగీకరింపబడదు (ద్వితీయో. 30:2 చూడు). ఇందులో ఇశ్రాయేలీయులు చేయనాజ్ఞాపించిన బలులు కూడ చేర్చబడ్డాయి. రాజైన సౌలు దేవునికి లోబడక బలులు అర్పించుటవలన దానిని "చక్కదిద్ద" ప్రయత్నించినప్పుడు, సమూయేలు అతనికి యిలా తెలిపాడు: "... ఆలోచించుము, బలులు అర్పించుటకంటె ఆజ్ఞను గైకొనుటయు, పొట్టేళ్ల క్రొవ్వు అర్పించుటకంటె మాట వినుటయు శ్రేష్ఠము" (1 సమూ. 15:22బి). తన లేఖనముల పరిశీలనలో, ఈ గొప్ప సత్యము యొక్క దిజ్మాత్ర దర్శనాన్ని పొందాడు. "అతడు వివేకముగా నుత్తరమిచ్చెనని యేసు గ్రహించి"న సంగతిని మార్కు గుర్తించాడు (మార్కు 12:34ఏ).

**ప్రభువువారి అంచనా**

ప్రభువు అతని హృదయాన్ని పరిశీలించి, తానెట్టివాడైయున్నాడో చూడగలిగారు. ధనవంతుడైన యువ అధికారి అంతరంగంలోనికి చూచి అతని ప్రేమించినట్టే (మార్కు 10:21) యిది (కూడ జరిగింది). అప్పుడు ప్రభువు – ఒక ఆసక్తికరమైన ప్రతిపాదనను చేశారు: "నీవు దేవుని రాజ్యమునకు దూరముగా లేవని అతనితో చెప్పెను" (మార్కు 12:34బి). "... పరలోక రాజ్యము సమీపమైయున్నదని" ప్రభువు ప్రకటిస్తున్నారు (మత్తయి 4:17), అయితే ఆ రాజ్య స్థాపనకు దగ్గరలో శాస్త్రి ఉన్నాడని ఆయన భావం కాదు. కాని, మెస్సీయ రాజ్య స్వభావాన్ని గూర్చిన గ్రహింపు ఆ మనిషికి యింతకుముందే కొంత ఉందని ఆయన తెలిపారు. యేసే మెస్సీయాయని అంగీకరించడానికి అతడు దగ్గరగా ఉండియుండవచ్చు. William Barclay యిలా రాశాడు: "యేసు కండ్లలో ప్రేమ చూపు ఉండియుండాలి, నీవు చాల దూరం వెళ్లావు. ఇంకా ముందుకు వచ్చి, నా మార్గంలో నీవు సంగతులను అంగీకరించకూడదా? అన్నట్టు మాట్లాడినప్పుడు విన్నవించే చూపులున్నాయి."[4]

ఆ కథ ఈ మాటలతో ముగుస్తుంది: "ఆ తరువాత ఎవడును ఆయనను ఏ ప్రశ్నయు[5] అడుగ తెగింపలేదు" (మార్కు 12:34సి). ఏదియెలాగున్నా, నేను **"నీవు దేవుని రాజ్యమునకు దూరముగా లేవు"** అనే ప్రతిపాదన మీద కొంత సమయం గడప గోరుతున్నాను.

## నేడు - రాజ్యమునకు దూరముగా లేవు

రాజ్యము స్థాపింపబడకముందు ఆ శాస్త్రి జీవించాడు – మనమైతే రాజ్యం[6] స్థాపింపబడిన తరువాత జీవిస్తున్నాం[7] – అయితే క్రీస్తువారి మాటలు నేడు కొందరి స్థితిని వర్ణించడంలేదా? ఆత్మసంబంధంగా జనులు మూడు చోట్ల ఉన్నట్టు మనం ఆలోచింపవచ్చు: "రాజ్యమునకు దూరముగా లేవు"; వారి పరిస్థితి మరోవిధంగా వర్ణించాలంటే, రాజ్యమునకు **"సమీపంగా"**[8] ఉన్నారు. కొందరు సమీపంగా ఉన్నారంటే, మరికొందరు **"దూరంగా"**[9] ఉన్నారని అర్థమిస్తుంది గదా? ఈ రెండు స్థితులు – కొందరు రాజ్యములో[10] ఉన్నారని సూచిస్తున్నాయి.

**"దూరంగా"** ఉన్నవారు హాజరులో ఉన్నట్టు మనం సులభంగా ఊహించుకోవచ్చు. దేవుని రాజ్యమునకు దూరంగా ఉన్నవారు ఆత్మ సంబంధమైన సంగతులలో సహజంగా అక్కరలేనివారై ఉంటారు. వాస్తవానికి, శ్రోతలలో ఎక్కువమంది **"రాజ్యంలో"**[11] ఉన్నవారై ఉండవచ్చు. ఏదియెలాగున్నా, క్రైస్తవులు కూడి వచ్చే ఏ సమయంలోనైనా, రాజ్యానికి సమీపంగా ఉన్నవారు హాజరవ్వడం కద్దు. ఒకవేళ బాప్తిస్మానికి సంబంధించిన తీర్మానం విషయంలో వారు పెనుగులాడుతూ ఉండవచ్చు. ప్రస్తుతానికి మన ప్రాథమిక దృష్టి సమీపంగా ఉన్నవారి మీద నిలుపుదాం.

## రాజ్యము యొక్క స్వభావం

మన పఠనం ముందుకు కొనసాగించకముందు, **రాజ్యము** అని మనం మాట్లాడుతున్నప్పుడు సరిగ్గా దాని భావమేమో మనం స్థాపించవలసియుంది. క్రీస్తును రాజుగా గుర్తించిన జనుల సముదాయాన్ని "రాజ్యము" అనే పదం సూచిస్తుంది – వారు క్రీస్తుయొక్క అధికారానికి తమ్మును తాము లోబరచుకున్న ప్రజలు వీరు.[12] మనం క్రైస్తవులమైనప్పుడు, దేవుడు మనలను "తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్య నివాసులనుగా" చేసినట్టు పౌలు రాశాడు (కొలస్సీ. 1:13). "దేవునికి ఒక రాజ్యముగా" మనలను చేసినట్టు యోహాను రాశాడు (ప్రకటన 1:6).

రాజ్యముగా చేయబడిన జనులు, క్రొత్తనిబంధనలో, యితర పదములతో సయితం గుర్తించబడ్డారు. మనలో ఎక్కువ మందికి సుపరిచితమైన పదం మత్తయి 16లో ఉంది. పేతురు మంచి ఒప్పుకోలు ఒప్పుకున్న తరువాత, ప్రభువు అతనితో యిలా అన్నారు: "... ఈ బండమీద (పేతురు ఒప్పుకున్న సత్యం మీద) నా సంఘమును కట్టుదును; పాతాళలోక ద్వారములు దానియెదుట నిలువనేరవు" (18 వ.).[13] భవనాన్ని కట్టుతున్న పోలికను క్రీస్తు యిక్కడ ఉపయోగించారు.[14] మూయబడిన తలుపులు తాళముతో తెరువబడాలనే ఉదాహరణను ఉపయోగించి, తరువాత వచనాన్ని ఆయన కొన సాగిస్తున్నారు. ఆయన పేతురుతో యిలా అన్నారు: "పరలోకరాజ్యము యొక్క తాళపు చెవులు నీకిచ్చెదను" (19ఎ వ.). తొలి సువార్త ప్రసంగం చేసే ఆధిక్యత ఆ అపొస్తలునికి యివ్వబడుతున్నట్టును, ఆ విధంగా పాపులు సంఘములోనికి ప్రవేశించునట్టు అతడు "ద్వారము తెరుస్తాడని" ప్రభువు వాగ్దానం చేశారు.[15] అయితే, మీరు చూడాలని నేను కోరే సత్యమేమంటే, ఈ లేఖన భాగంలో, "రాజ్యము," "సంఘము" అనే పదాలను క్రీస్తు పర్యాయ పదాలుగా వినియోగించారని. **రాజ్యంలో ఉండడమంటే, సంఘములో ఉండడమే.**[16]

"సంఘము" అని తర్జుమా చేయబడిన గ్రీకు పదం *ekklesia*, "పిలువబడిన [వారు]" అని దాని అక్షరార్థం. క్రీస్తుయేసుతో నూతన బాంధవ్యం కలిగియుండడానికి గాను లోకంలోనుండి పిలువబడినవారిని ఈ పదం సూచిస్తుంది. ఈ ప్రత్యేకమైన జనులను సూచించడానికి కార్యగ్రంథంలోను పత్రికలలోను ఈ పదము బహు సాధారణంగా ఉపయోగింపబడింది (ఉదాహరణకు, అపొ. 5:11; 8:1, 3; 9:31; రోమా 16:1; 1 కొరింథీ. 1:2 చూడు).

ఇదే జనులను సూచించడానికి ఉపయోగింపబడిన మరొక పదం – "శరీరము" ఎఫెసీ. 1:22, 23లో పౌలు యిలా రాశాడు: "మరియు సమస్తమును ఆయన [క్రీస్తు] పాదములక్రింద ఉంచి, సమస్తముపైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆ సంఘము ఆయన శరీరము; సమస్తమును పూర్తిగా నింపుచున్నవాని సంపూర్ణతయై యున్నది" కొలస్సీ. 1:18లో ఈ క్రమాన్ని తిరగదిప్పి చూపాడు: "సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు." గనుక, **సంఘములో ఉండడమంటే శరీరములో ఉండడమే.**[17]

సంఘ/రాజ్యములో ఉన్న జనము ఎలా పనిచేయాలో సూచించడానికి ఉపయోగింప

బడిన పదమే "శరీరము." భౌతికమైన శరీరము అనేక అవయవములు కలిగియున్నట్టే (చేతులు, కాళ్లు, వగైరాలుగా), క్రీస్తు శరీరములో క్రైస్తవులుగా మనం "అవయవములై యున్నాము" (1 కొరింథీ. 12:27) – క్రీస్తు శరీరమునకు "శిరస్సై"యున్నారు (కొలస్సీ. 1:18).

**రాజ్యము**పైనున్న రాజుతోను, **సంఘాన్ని** కట్టే నిర్మాతతోను, **శరీరము**నకు శిరస్సైయున్న ఆయనతోను మనకు గల బాంధవ్యాన్ని నొక్కి పలకడానికి సూచించే పద ప్రయోగాన్ని ప్రస్తావించుతాను: ఆ పద ప్రయోగం "**క్రీస్తునందు**" అనేది.[18] రక్షకునితో మనకున్న సన్నిహిత బంధాన్ని సూచించడానికి పౌలుకు "క్రీస్తునందు" అనేది ప్రియమైన ప్రయోగమైయుంది. దీన్ని సూచించే రెండు లేఖన భాగాలు యిక్కడ యివ్వబడ్డాయి: "... ఆయన [దేవుని] మూలముగా మీరు క్రీస్తుయేసునందున్నారు" (1 కొరింథీ. 1:30ఎ); "కాబట్టి యిప్పుడు క్రీస్తు యేసు నందున్నవారికి ఏ శిక్షావిధియు లేదు" (రోమా 8:1).[19] ఒకడు క్రైస్తవుడైన తోడనే అతడు క్రీస్తును "ధరించుకుంటాడు" (రోమా 13:14; గలతీ. 3:27లను చూడు).

"క్రీస్తునందు" ఉండడమంటే, రాజ్యములో, సంఘములో, శరీరములో ఉండడమే. సౌలు **సంఘాన్ని** హింసించుతున్నప్పుడు (అపొ. 8:1–3; ఫిలిప్పీ. 3:6), అతడు **క్రీస్తును** హింసించుచున్నాడు (అపొ. 22:8). క్రీస్తును ఆయన శరీరాన్ని విడదీయ్యడం అసాధ్యం. నేను ఒక మాత్రను మ్రింగినప్పుడు, ఆ మాత్ర నాలో ఉంది, లేక నా శరీరంలో ఉందని చెప్పవచ్చు.

### రాజ్యపు దీవెనలు

**రాజ్యము/సంఘము/శరీరము/క్రీస్తులో** ఉండడం ఎంత ప్రాముఖ్యం? ఎఫెసీ. 1:3 చదువు: "మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క తండ్రియైన దేవుడు స్తుతింపబడును గాక! ఆయన క్రీస్తునందు పరలోక విషయములలో ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మనకనుగ్రహించెను." "ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదము"[20] అని పౌలు తెలియ జేశాడు – అవి "ఎక్కువ ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదములు కావు"; దాదాపు ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదము కాదు; కాని **ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదము** అని గమనించాలి. పైగా ఆ ఆశీర్వాదములన్నీ "**క్రీస్తులో**"నే ఉన్నట్టు అతడు సూచించాడు. అందువలన, అవి **సంఘము**, **రాజ్యము**, **శరీరంలో** ఉన్నాయి.

క్రీస్తునందు లభించే ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదాన్ని చర్చించడానికి సమయం చాలదు. Joe Laird యిలా రాశాడు,

> ఆత్మ సంబంధమైన ఈ ఆశీర్వాదాలకు కొన్ని ఉదాహరణలు ... పాపక్షమాపణ, క్రీస్తు రక్తము, మన గొప్ప ప్రధాన యాజకుడుగా క్రీస్తు, ప్రార్థన ఆధిక్యత, ప్రభురాత్రి భోజనము, దేవుని వారసులము, క్రీస్తు తోటివారసులం, పరిశుద్ధాత్మ మనలో నివసించడం, దేవునితో నిత్య జీవమును గూర్చిన వాగ్దానం ...[21]

మనం సూచించిన పదాలకు సంబంధించి రెండు మూడు ఆశీర్వాదాలను ప్రత్యేకంగా

చూద్దాం. మన ఆశీర్వాదమేమంటే, క్రీస్తునందు మనకు గత పాపములనుండి విమోచన[22] ఉంది. ఈసారి 14వ వచనం చేర్చి: కొలస్సీ. 1:13ను మరోసారి చూడు, "ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములోనుండి విడుదలచేసి, తాను ప్రేమించిన తన కుమారునియొక్క రాజ్యనివాసులనుగా చేసెను. ఆ కుమారునియందు మనకు విమోచనము, అనగా పాపక్షమాపణ కలుగుచున్నది." విమోచన **క్రీస్తునందు – శరీరమునందు, సంఘమునందు, రాజ్యమునందు** ఉన్నది.

మన గత పాపములనుండి విమోచనపొందామంటే, ఆ పాపములనుండి మనం రక్షింపబడ్డామని మరో విధంగా చెప్పవచ్చు. క్రీస్తు రక్తముద్వారా శరీరములో, సంఘములో మనకు **రక్షణ** ఉంది [23] క్రీస్తుకును సంఘమునకును గల బాంధవ్యాన్ని పౌలు భార్యకును భర్తకును కలిగిన బాంధవ్యంగా సూచించే ఎఫెసీ. 5ను చూడు. ప్రత్యేకించి 23, 25వ వచనాలను గమనించు:

> క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నలాగున పురుషుడు భార్యకు శిరస్సై యున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడైయున్నాడు (23 వ.).
>
> పురుషులారా, మీరును మీ భార్యలను ప్రేమించుడి, అటువలె క్రీస్తు సంఘమును ప్రేమించి ... దానికొరకు తన్నుతాను అప్పగించుకొనెను (25 వ.).

నీవు రక్షింపబడాలంటే, నీవు **శరీరంలో** ఉండి తీరాలి; క్రీస్తు ప్రభువు బలిలోని మేళ్లను అనుభవించాలంటే, నీవు **సంఘములో** ఉండి తీరాలి.

విమోచింపబడడం, రక్షింపబడడం అనేది **దేవుని పిల్లలని** మనం పిలువబడుటయే ఔతుంది.[24] గలతీ. 3:26, 27 యిలా అంటుంది: "యేసు క్రీస్తునందు మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులైయున్నారు [KJVలో 'దేవుని పిల్లలైయున్నారు']. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొనియున్నారు." మనము క్రీస్తులోనికి బాప్తిస్మం పొందినప్పుడు క్రీస్తును ధరించుకొనినవారమై యుంటాం, అప్పుడు మనము దేవుని కుమారులమై యుంటాం – లేక KJV అన్నట్టు – దేవుని పిల్లలమై యుంటాం. "ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను" అని పౌలు కొరింథీయులకు తెలియజేశాడు (2 కొరింథీ. 5:17).

రాజ్యము/శరీరము/సంఘము/ క్రీస్తునందు అనే పదానికి అర్థమేమి? **ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదము** మనకున్నదని అర్థం.[25] గత పాపములనుండి మనకు విమోచనము ఉందని, మనకు రక్షణ ఉందని అర్థం. మనం **దేవుని పిల్లలమని** అర్థం. రాజ్యము/సంఘము/శరీరము/క్రీస్తులో ఉన్న ఆశీర్వాదముల మంచి సంగ్రహము ఎఫెసీ. 2:12, 13లో ఉంది:

> ఆ కాలమందు[26] ఇశ్రాయేలుతో సహా పౌరులుకాక, పరదేశులును, వాగ్దాన నిబంధనలు లేని పరజనులును, నిరీక్షణలేనివారును, లోకమందు దేవుడు లేని వారునైయుండి. క్రీస్తుకు దూరస్థులైయుంటిరని మీరు జ్ఞాపకము చేసికొనుడి. అయినను మునుపు దూరస్థులైన మీరు ఇప్పుడు క్రీస్తు యేసునందు క్రీస్తు[27] రక్తమువలన సమీపస్థులై యున్నారు.

మరోవైపు, రాజ్యము/సంఘము/శరీరము/క్రీస్తుకు దూరస్థులంటే అర్థమేమి? నీవు ఆ స్థితిలో ఉన్నట్టయితే, నీ గత పాపములనుండి విమోచింపబడడానికి బహు దూరంగా ఉన్నావు; **రక్షణకు** బహు దూరంగా ఉన్నావు. **దేవుని బిడ్డవై**యుండడానికి బహు దూరమై యున్నావ్.

రాజ్యము/సంఘము/శరీరము/క్రీస్తునకు **దగ్గరగా** ఉన్నావంటే అర్థమేమి? నీవు ఆ స్థితిలో ఉన్నట్టయితే, నీ గత పాపములనుండి విమోచింపబడడానికి సమీపంగా; నీవు రక్షణకు సమీపంగా ఉన్నావని అర్థం. నీవు దేవుని బిడ్డవైయుండడానికి బహు సమీపంగా ఉన్నావని[28] – అయితే ఈ ఆశీర్వాదాల్లో ఏదీ నిజంగా నీవు యింకా పొందలేదని అర్థం.

## రాజ్యముతో మనకున్న బాంధవ్యం

ఇది నీ మనస్సులో కొన్ని ప్రశ్నలను రేకెత్తింపవచ్చును గాని, వాటికి నేను జవాబు చెప్పక ముందు సమీపంగాను దూరంగాను ఉన్నవారి మధ్య ఉన్న తారతమ్యాలను చూపుటలో కొన్ని నిమిషాలు గడుపుతాను. ఏ యిద్దరు మనుష్యులును ఖచ్చితంగా ఒకే రకంగా ఉండరు గనుక, నేను సాధారణమైన భావంతోనే మాట్లాడవలసియుంటుంది; అయితే ఈ రెండు పరిస్థితులలో ఉండే వ్యత్యాసాలను చూద్దాం.

రాజ్యమునకు **దూరంగా** ఉన్నవారు అకారణ (పరతత్వ) **ద్వేషముగలవారై యుంటారు.**[29] వారు ఆత్మ సంబంధమైన సంగతులను గూర్చి ఆలోచింపగోరరు. “నా మనస్సులో తీర్మానం చేసికొన్నాను; వాస్తవాలతో నన్ను తికమక చేయవద్దు” అని ఒకప్పుడు చదివిన సైన్ బోర్డులా వారు ఉంటారు. అయితే, రాజ్యమునకు సమీపంగా ఉన్నవానికి **యథార్థమైన హృదయం** ఉంటుంది.[30] ఆ శాస్త్రి హృదయంలోనికి చూచినప్పుడు, ప్రభువు బహుశ ఈ గుణలక్షణం కనుగొనియుండవచ్చు. పరిసయ్యులలో అనేకుల హృదయాన్ని కఠినపరచిన అకారణ ద్వేషంచేత అతడు దహించబడలేదు.

కొందరు **దుష్టత్వంచేత దేవుని** రాజ్యానికి **దూరంగా** ఉంటారు.[31] వారు ఈలోక సంబంధమైన నైతిక ప్రమాణలను ఆశ్రయించారు, దాని విషయం గుర్తు చేయబడడానికి యిష్టపడకయుంటారు. ఇతరులు రాజ్యానికి సమీపంగా ఉండడంలో, తప్పొప్పులు విచక్షణ వారికి తెలుసు, **మంచి నైతిక జీవితాన్ని జీవించడానికి** ప్రయాసపడతారు.[32]

దేవుని చిత్తాన్ని గూర్చిన ఉపదేశం లేనందున[33] కొందరు దూరంగా ఉంటారు. నేర్చుకునే అవకాశం వారికి దొరకక పోవచ్చు, లేదా దొరికినా, దాన్ని సద్వినియోగం చేసికో పోవచ్చు. దానికి భిన్నంగా, సమీపంగా ఉన్నవారు, సాధారణంగా నేర్చుకొనడానికి వేగిరపడతారు;[34] వారు దేవుని వాక్యాన్ని తెలిసికోగోరతారు. ఒకవేళ వారు స్వయంగా చదువుకొంటుండవచ్చు; లేదా వారి ఆత్మలను గూర్చిన అక్కర గలవారితో చదువుతూ ఉండవచ్చు.

దూరంగా ఉన్నవారు **ఆత్మ – సంతృప్తి** గలవారైయుండే తత్వాన్ని ప్రదర్శిస్తారు:[35] “నేనున్న స్థితిలో నేను బాగానే ఉన్నాను; నా జోలికి రావద్దు!” Quinlan, Texasలో, కొన్ని సంవత్సరాల క్రిందట వరుస ప్రసంగాలు చేయుమని కోరబడ్డాను. నేను అక్కడికి వెళ్లకముందు, స్థానికి సువార్తికుడు వెళ్లి, లోబడతాడన్నట్టు కన్పించిన ఒక మనిషిని

చూచాడు. ఆ మనిషియొక్క ఆత్మసంబంధమైన పరిస్థితిని గూర్చి చర్చించడానికి సువార్తికుడు అతని సంధించాడు. అప్పుడతడు, "సువార్తికుడా, ఒక నిమిషం ఆగు! నీవు నీ సందర్శనాన్ని పాడుచేసికోబోతున్నావు! నీవు కొంచెం సేపు ఆగి సందర్శించ గోరితే, మతాన్ని మన మధ్యకు తేవద్దు. నీవు మతాన్ని గూర్చే మాట్లాడగోరితే, అదిగో తలుపు!" అని సువార్తికునితో అన్నాడట! దీనికి భిన్నంగా. **సమీపంగా** ఉన్నవారు, సాధారణంగా ఆత్మ సంబంధమైనవారి **అవసరతలను** ఎరిగినవారై యుంటారు.[36] కొన్ని సార్లయితే, వారు నశించిన స్థితిలో ఉన్నట్టును, రక్షణకొరకు వారు ప్రభువునొద్దకు రావలసిన అవసరమున్నట్టును వారు గుర్తించియుంటారు.

నేను అభ్యంతరాన్ని వింటున్నాను: "అక్కడ ఆగు! **యథార్థ హృదయం** గలిగి, మంచి **నైతిక జీవితాన్ని జీవించుతూ**, ఆత్మ సంబంధమైన అవసరతలు ఎరిగి, **నేర్చుకొనడానికి ఆతురతగల** వానిని గూర్చి మాట్లాడుతున్నావు, అలాటి మనిషి **నశించిపోయాడని నీవు** అంటున్నావా?"

అలాకాకుంటే బాగుండునని నేను కోరతాను, దాన్ని నేను హృదయపూర్వకంగా కోరుకుంటాను – కాని వేరువిధంగా ఉపదేశించి నేను బైబిలుకు నమ్మకంగా ఉండలేను. రాజ్యమునకు **సమీపంగా** ఉన్న వ్యక్తి సయితం ఎందుకు నశించిపోతాడు? ఎందుకంటే, అతడు క్రీస్తులో లేడు. అక్కడ **ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదముంది**. తన గత పాపములనుండి **విమోచింపబడునట్లు**, అతడు క్రీస్తు రక్తములో కడుగబడలేదు. సమీపంగా ఉన్నవానికి బైబిలు ఉదాహరణను నీవు చూడగోరితే, కొర్నేలీయను రోమా శతాధిపతివైపు చూడు. దైవ ప్రేరేపితమైన ఈ లేఖన భాగాన్ని విను:

> ఇటలీ పటాలమనబడిన పటాలములో శతాధిపతియైన కొర్నేలీ అను భక్తిపరుడొకడు కైసరయలో ఉండెను. అతడు తన యింటివారందరితో కూడ దేవునియందు భయభక్తులు గలవాడైయుండి. ప్రజలకు బహు ధర్మము చేయుచు ఎల్లప్పుడును దేవునికి ప్రార్థన చేయువాడు (అపొ. 10:1, 2).

నీవు ఈ మనిషిని గూర్చి చదువుతుండగా, అతడు **యథార్థ హృదయము** గలవాడై నట్టు, **మంచి నైతిక జీవితాన్ని** జీవిస్తున్నట్టు; అతడు తన **ఆత్మసంబంధమైన అవసరతలను** ఎరిగినవాడైనట్టు, నేర్చుకొనడానికి ఆసక్తిగలవాడైయున్నట్టు, ప్రార్థనాపరుడైయున్నట్టు కనుగొనగలవు! అయినా అతడు రక్షింపబడెనా? "– నీవు యొప్పేకు మనుష్యులను పంపి పేతురు అను మారు పేరుగల సీమోనును పిలిపించుము; నీవును నీ యింటివారందరును ఏ మాటలవలన రక్షణపొందుదురో ఆ మాటలు అతడు నీతో చెప్పునని" తన యింట నిలిచి తనతో ఒక దూత చెప్పాడు (అపొ. 11:13, 14). కొర్నేలీ **సమీపంగా** ఉన్నాడు – బహు సమీపంగా ఉన్నాడు – అయితే అతడు అప్పటికి రక్షింపబడలేదు. అభిమానించడానికి శతాధిపతిలో ఎన్నో మంచి లక్షణాలున్నాయి, అయినా నశించిపోయి ఉన్నాడు.[37]

**రాజ్యములోనికి ప్రవేశం**

తరువాత ప్రశ్న ఏమంటే – "రాజ్యములోనికి ప్రవేశించేది[38] ఎలా?" **రాజ్యము/సంఘము/శరీరము/క్రీస్తులోనికి** ప్రవేశించాలంటే ఏమి జరగాలి? ఈ ప్రశ్నకు జవాబు చెప్పడానికి గాను మనం ముందుగా చర్చించిన పదాలకు సంబంధించిన లేఖనాలపై దృష్టి మరోసారి నిలుపగోరుతున్నాను.

మత్తయి 18:3 "రాజ్యము" అనే పదాన్ని ఉపయోగిస్తుంది. "– మీరు మార్పునొంది[39] బిడ్డలవంటివారైతేనేగాని పరలోక రాజ్యములో ప్రవేశింపరని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను." **రాజ్యములోనికి ప్రవేశించడానికి మార్పు జరగాలి**.[40] మార్పు విధానం మూడు రకాలు:

(1) విశ్వాసమువలన కలిగే తత్వముయొక్క మార్పు ఉండాలి. "... నేనే ఆయనను (మెస్సీయను) అని మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోవుదురని" ప్రభువు వారితో చెప్పారు (యోహాను 8:24).

(2) జీవితంలో, మారుమనస్సువలన కలిగే, మార్పు ఉండాలి, "మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరును ఆలాగే నశించుదురు" అని ప్రభువు తెలిపారు (లూకా 13:3).

(3) బాంధవ్యాలలో మార్పు ఉండాలి – బాప్తిస్మమువలన తేబడే మార్పు – ప్రభువుతో మనకున్న బాంధవ్యంలో మార్పు. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడునని" ప్రభువు తెలిపారు (మార్కు 16:16ఎ).

భక్తిగల అనేకమంది జనులు, మార్పు జరిగే విధానంలో విశ్వాసము, మారుమనస్సు తప్పనిసరి అని గ్రహించుతారు, కొందరైతే, **బాప్తిస్మము** యొక్క అవసరతను సవాలు చేస్తారు.[41] గనుక, రాజ్యంలో ప్రవేశించే విషయంలో ఆగి కొన్ని సంగతులను ఆలోచించుదాం. రాజ్యాన్ని వర్ణించడానికి ఏ పదం ఉపయోగించడానికి మనం ఎన్నుకున్నా, మన ప్రవేశం కొరకు నీటిలో ముంచడం అవసరమైయుంటుంది:

- **"రాజ్యము"** అనే పదానికి సంబంధించి, యోహాను 3:5లో క్రీస్తు ప్రభువు ఏమన్నారో గమనించు: "– ఒకడు నీటిమూలముగాను[42] ఆత్మ మూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను."
- **"సంఘము"** అనే పదానికి సంబంధించి, అపొ. 2కు వెళ్లదాం. "మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడును యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి" (38 వ.) అని పేతురు ప్రజలకు తెలిపాడు. తరువాత, "కాబట్టి అతని వాక్యము అంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి; ఆ దినమందు ఇంచుమించు మూడువేల మంది చేర్చబడిరి" (41 వ.). 47వ వచనం యిలా అంటుంది: "ప్రభువు రక్షణ పొందుచున్నవారిని అనుదినము వారితో చేర్చుచుండెను." రక్షింపబడిన వారిని ప్రభువు రక్షింపబడిన (శరీరము) కూటమితో చేర్చుచుండెను –

అంటే సంఘమునకు చేర్చుచుండెను (ఎఫెసీ. 5:23, 25). పేతురు మాటలను అంగీకరించి బాప్తిస్మం పొందినవారిని గూర్చి KJV యిలా అంటుంది: "రక్షింపబడుచున్నవారిని ప్రభువు అనుదినము సంఘముతో చేర్చుచుండెను" (అపో. 2:47).

- **"శరీరము"** అనే పదమును గూర్చి 1 కొరింథీ. 12:13ఎ చూడు: "... మన మందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి."[43]
- **"క్రీస్తులోనికి"** అనే పదాన్ని గూర్చి గలతీ. 3:26, 27లను తిరిగి చూద్దాం: "యేసు క్రీస్తునందు మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు." ప్రాథమికంగా యిదే సత్యాన్ని బోధించే మరో లేఖన భాగం. రోమా 6:3, 4:

> క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? కాబట్టి తండ్రి మహిమవలన క్రీస్తు మృతులలోనుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతన జీవము పొందిన వారమై నడుచు కొనునట్లు, మనమును బాప్తిస్మమువలన మరణములో పాలు పొందుటకై ఆయనతోకూడ పాతిపెట్టబడితిమి.

ప్రభువునందు నమ్మికయుంచి, మన పాపముల విషయమై మారుమనస్సు పొంది, బాప్తిస్మం పొందుట ద్వారా మన హృదయాలు, జీవితాలు, బాంధవ్యాలు మార్పు పొందినప్పుడు వచ్చే ఫలితమేమి? అప్పుడు దైవికమైన – "**మరియొకచోటికి మార్పు**" జరుగుతుంది.[44] "దేవుడు మనలను అంధకార సంబంధమైన అధికారమునుండి విడుదలచేసి, తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్యనివాసులుగా చేసెను" (కొలస్సీ. 1:13)! మనం **సంఘముతో** చేర్చబడ్డాం. మనం **శరీరంలో** అవయవములుగా చేయబడ్డాం; **క్రీస్తును** ధరించుకున్నాం.

**"రాజ్యములో"** అనే ప్రయోగానికి అర్థం అంతేగాకుండ, **"దూరము"**గా **"దగ్గరగా"** అనేవాటిలో గుప్తమైన భావం కూడా మనకు తేటగా గ్రహింపు అయ్యుండాలి – దూరంగా ఉన్నా, దగ్గరగా ఉన్నా, రాజ్యానికి వెలుపట ఉన్నవారు మార్పునొందినవారు కారు. వారు యింకను లేఖనానుసారంగా బాప్తిస్మం పొందనందున, **రాజ్యము/సంఘము/శరీరము/క్రీస్తు**లోనికి వారింకా మార్చబడలేదు లేక చేర్చబడలేదు. గత పాపములనుండి **విమోచన** మరియు **రక్షణ**, **దేవుని కుమారులుగా** ఎంచబడుటతో పాటు ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదము ఉన్నది అక్కడే.

## ముగింపు

కొందరు దేవుని రాజ్యమునకు దగ్గరగా ఉండి, లోనికి ఎందుకు రానొల్లకున్నారో నేను నిశ్చయంగా చెప్పజాలను. కొందరు తరువాత ప్రవేశింపగోరవచ్చు. తమకు

అవసరమైనంత తెలియదని కొందరు తలంచవచ్చు; వారికి యింకా ప్రశ్నలు మిగిలిపోయాయి లేక యింకా యితరులు తాము చాలా చిన్న – చాల పెద్ద వయస్సని తలంచవచ్చు.

ఇది మాత్రం నేను చెప్పగలను – లేఖనములను బట్టియు, ప్రజలతో సంవత్సరాల తరబడి ఉన్న పరిచయమును బట్టియు: ఎవరును **దగ్గరగా** ఉండరు. నా మాట వినిపించిందా? ఎవరును దగ్గరగా ఉండరు. దగ్గరగా ఉన్న ఎవరైనా యిటు రాజ్యములోనికైనా ప్రవేశిస్తారు లేదా దూరంగానైనా తొలిగిపోతారు. అవకాశాన్ని నిరాకరించిన ప్రతిసారి హృదయం కఠినమౌతుంది. ఆ వ్యక్తి రాజ్యంనుండి దూరమైపోయాడా, తిరిగి ఆ మొదటి ఆసక్తిని రగిలించడం అసాధ్యం. దేవుని వాక్యపు నడిపింపులో కొనసాగి రాజ్యములోనికి రాకపోతే, సమీపంగా ఉన్నా అపాయకరమైన స్థితియే!

ప్రభువునకు లోబడగోరిన ఎవరికైన ఆహ్వానాన్ని అందించగోరుతున్నా – త్రోవ తప్పిన క్రైస్తవులతోను యితర కారణాలకొరకు ప్రార్థన కోరినవారితో సహా రాజ్యానికి సమీపంగా ఉన్న ఎవరికైనా ఈ మనవిని వినిపిస్తున్నా. ఆ స్థలంలో ఎక్కువసేపు ఉండకూడదని గ్రహించు.[45] "నీతిని, ఆశానిగ్రహమును, తీర్పును గూర్చి" పౌలు ఫేలిక్సుతో చర్చించి నప్పుడు ఆ అధిపతి భయపడ్డాడు (అపొ. 24:25ఎ). అతడు రాజ్యమునకు కొంత దగ్గరకు వచ్చాడు, అటు తరువాత దూరంగా తొలిగిపోయాడు. "– ఇప్పటికి వెళ్లుము, నాకు సమయమైన నిన్ను పిలువనంపింతునని చెప్పెను" (అపొ. 24:25బి). అగ్రిప్పకు పౌలు ప్రసంగించినప్పుడు, రాజు పౌలుతో యిలా అన్నాడు: "– ఇంత సులభముగా నన్ను క్రైస్తవుని చేయ జూచుచున్నావే" (అపొ. 26:28). అతని హృదయం తాకబడియుంటే,[46] దాని విషయం అతడు పట్టించుకున్నట్టు లేదు.

దగ్గరకు వచ్చిన ప్రతి వ్యక్తియు దూరంగా తొలిగిపోనందుకు దేవునికి స్తోత్రము. సమీపంగా ఉండియు నశించిన స్థితిలో ఉన్న ఉదాహరణకు గతంలో కొర్నేలీని ప్రస్తావించాను. తన మార్పుకు సంబంధించిన కథ అపొ. 10:1–11:18లో చెప్పబడింది. అతడు క్రీస్తునందు విశ్వాసముంచి (10:43), బాప్తిస్మం పొందాడు (10:48). మరో ఉదాహరణ అపొ. 8:26–39లో చెప్పబడి ఇతియొపీయ నపుంసకుడు **దగ్గర** అని ప్రయోగించిన ప్రతి పదం అతనికి వర్తిస్తుంది. అతనికి **యథార్థ హృదయముంది;** అతడు మంచి **నైతిక జీవితాన్ని జీవిస్తున్నట్టు** మనం ఊహించగలం; అతడు **నేర్చుకొనడానికి ఆసక్తిగలవాడైయున్నాడు**; ఆత్మ సంబంధమైన తన **అవసరతను ఎరిగినవాడై యున్నాడు**. ఫిలిప్పు అతనికి ఉపదేశించిన తరువాత (35 వ.), "– ఇదిగో నీళ్లు; నాకు బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమని" అడిగాడు (36 వ.). "– నీవు పూర్ణహృదయముతో విశ్వసించిన యెడల పొందవచ్చునని" సువార్తికుడు అతనితో చెప్పాడు (37ఎ వ.).[47] ఆ సమయంలో ఆ నపుంసకుడు ముందుకుగాని వెనుకకుగాని కదలాలి; తాను ఎక్కడ ఉన్నాడో అక్కడే ఉండలేదు. అతడు ప్రభువునందు తన విశ్వాసాన్ని ఒప్పుకున్నాడని నేను ఆనందిస్తున్నాను (37బి వ.) బాప్తిస్మం కూడ పొందాడు (38 వ.). కొర్నేలీయు, నపుంసకుడును తమ నిర్ణయాలు చేసికొని లోబడినప్పుడు, వారు **రాజ్యములో/ సంఘములో/శరీరములో/క్రీస్తులో** ఉన్నారు, **ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదమును** అనుభవించగలిగారు.

అయితే దగ్గరకు వచ్చిన శాస్త్రి సంగతి ఏమయ్యింది? యేసును మెస్సీయగా అతడు అంగీకరించాడా? పెంతెకొస్తు దినమున, అతడు మారుమనస్సు పొందాడా? అతడు బాప్తిస్మం పొందియుంటాడా? నాకు తెలియదు, కాని యిక్కడ ప్రధానమైన ప్రశ్న ఒక్కటుంది: "నీ సంగతి ఏమి?" ఒకవేళ నీవు సమీపంగా ఉండవచ్చు, అలాగైనట్టయితే, ప్రభువు పక్షముగా నపుంసకుడు చేసినట్టు తీర్మానం చేసికొని ఆనందించు, తీర్మానం నీది.

## నోట్సు

Joe Laird - "Are You Near the Kingdom" in the book: *Oft-Asked Questions* (Oklahoma City, Okla.: Joe W. Laird & Hoyt Huffines, 1960), 173-87. మీద నా ప్రసంగం ఆధారపడింది. చార్టు Joe చాక్ బోర్డు మీద గీసింది నేను ఉపయోగించాను. అనేక మూలాలను కూడా చెక్ చేశాను.

నేను ప్రసంగం కొనసాగుతున్న కొలది వివరాలను చేర్చుటకు ఈ ఛార్టులో ఫ్లానల్ గ్రాఫ్ ప్రజెంటేషన్ చేసాను. ఈ ఛార్ట్ చాక్‌బోర్డుమీదగాని ఒక కార్డుబోర్డు ముక్కమీదగాని రాయవచ్చు. నేను మధ్యనే ఈ ఛార్టును పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో ఉపయోగించాను. ఈ ఛార్ట్ NASB పదాలపై ఆధారపడింది. మీరు మరొక పద్ధతిని ఉపయోగిస్తే ఇందులోని కొన్ని పదాలను మార్చవలసి ఉంటుంది.

ఈ పాఠాన్ని ఇంకొక విధంగా చూపేపద్ధతి ఏదంటే వేదిక చుట్టు ఉన్న వేర్వేరు స్థలాలను "దూరంగా," "దగ్గరగా," లో అని చూపాలి.

---

సూచనలు

[1]ఈ అంశముపైన ఉన్న చార్టును ఉపయోగించు. [2]ప్రశ్నల మహా దినము కొరకైన పూర్వ చరిత్రను "క్రీస్తు జీవితం, 5లో" చూడు. ఇక్కడ చర్చించిన సంఘటనల కొరకైన పూర్వ చరిత్రకు గత పాఠమును చూడు. [3]తనంతట తానే ముందుకొచ్చాడు. "క్రీస్తు జీవితం, 5ను" చూడు. [4]William Barclay, *The Gospel of Mark*, rev. ed., The Daily Study Bible Series (Philadelphia: Westminster Press, 1975), 296-97. [5]"తెగింపలేదు" అనే అర్థమిచ్చు ప్రాచీన ఆంగ్ల పదాన్ని KJV ఉపయోగించింది. [6]"రాజ్యము" అనే పదాన్ని చార్టులోని చెతురస్రములో పై భాగమున ఉంచు. [7]శిష్యుల జీవిత కాలములోనే రాజ్యము శక్తితో వచ్చునని యేసు చెప్పారు (మార్కు 9:1). పరిశుద్ధాత్మ వచ్చునప్పుడు శక్తి వచ్చునని కూడ చెప్పారు (అపొ. 1:8). క్రీస్తు మరణం, సమాధి, పునరుత్థానముల తరువాత మొదటి పెంతెకొస్తు దినాన పరిశుద్ధాత్ముడు వచ్చాడు (అపొ. 2:1–4). ఆ సమయములో శక్తి వచ్చింది గనుక రాజ్యం స్థాపించబడింది. [8]"దగ్గర" అనే పదమునకు సమీపాన సూచించే స్థలములో ఉంచు. [9]"దూరము" అనే చార్టులో ఉండు. [10]"దేవుని రాజ్యము" అనే పదముతో "లో" అనే పదాన్ని కలుపు.

[11]ఈ ప్రసంగములో తరువాత మనం చూడబోయే రూపంలో ప్రభువు సంఘములోని వారిని సూచించడానికి క్రైస్తవులు అని ఉపయోగించాను. [12]"రాజ్యము" అనే పదము క్రొత్తనిబంధనలో – పరలోకంలోగాని, లేదా భూమియందంతట దేవుని అధికారాన్ని సూచించడానికి అనేక విధాలుగా ఉపయోగించబడింది. మనం ఉపయోగించే లేఖన భాగాలు మాత్రం పెంతెకొస్తు దినం తరువాత "సంఘము" అని బహు సహజంగా పిలువబడే ప్రజల సముదాయాన్ని సూచిస్తుంది. "రాజ్యమును" గూర్చి "కార్య గ్రంథం, 1"లో చూడు. [13]మత్తయి 16:13–20లపై సంక్షిప్త వ్యాఖ్యానంకొరకు "క్రీస్తు జీవితం, 3ను"

చూడు. [14]సంఘము అనేది బిల్డింగు కాదు ప్రజలు. [15]క్రీస్తు పునరుత్థానం తరువాత వచ్చిన తొలి పెంతెకొస్తు దినాన యిది జరిగింది (అపొ. 2:14–40). [16]"దేవుని రాజ్యములో" అనే పదము క్రింద "సంఘములో" అనే పదాన్ని ఉంచు. [17]"శరీరములో" అనే పదాన్ని "సంఘములో" అనే పదం క్రింద ఉంచు. [18]"శరీరములో" అనే పదము క్రింద "క్రీస్తులో" అనే పదాన్ని ఉంచు. [19]ఉదాహరణకు "క్రీస్తులో," "యేసులో," "యేసు క్రీస్తులో," "క్రీస్తు యేసులో" అనే పదాలను కన్‌కాడన్స్‌లో చూడు. [20]"ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదం" అనే దానిని చార్టులో చేర్చు.

[21]Joe Laird, *Oft-Asked Questions* (Oklahoma City: Joe W. Laird & Hoyt Huffines, 1960), 176-77. [22]"విమోచన" అనే పదాన్ని చార్టులో చేర్చు. [23]"రక్షణ" అనే పదాన్ని చార్టులో చేర్చు. [24]"దేవుని పిల్లలు" అనే దానిని చార్టులో చేర్చు. [25]ఈ ప్రసంగములో చెప్పిన విషయాలను మరల చెప్పటం ఉద్దేశ పూర్వకంగా చెప్పాను. ఏలయనగా "మరల చెప్పుట నేర్చుకొనుటకు మూలం" గనుక. [26]చెతురస్రమునకు వెలుపు భాగాన్ని సూచించు. [27]"క్రీస్తులో" అనేదాన్ని సూచించు. [28]"దేవుని పిల్లలు" అనేదాన్ని సూచించు. [29]"అకారణ ద్వేషము" అనే పదమును చార్టులో చేర్చు. 2 థెస్స. 2:10 దీనికి సంబంధించిన వాక్య భాగమైయుంది. [30]"యథార్థ హృదయం" అనే పదమును చార్టులో చేర్చు. మత్తయి 5:6; యోహాను 7:17; అపొ. 10:33; 1 సమూ. 3:9లు దీనికి సంబంధించిన వాక్య భాగాలు.

[31]"దుష్టత్వం" అనే పదమును చార్టులో చేర్చు. [32]"మంచి, నైతిక జీవితం" అనే పదమును చార్టులో చేర్చు. [33]"ఉపదేశం లేకపోవడం" అనే పదమును చార్టులో చేర్చు. [34]"నేర్చుకోవాలనే ఆత్రుత" అనే పదమును చార్టులో చేర్చు. [35]"స్వయం – సంతృప్తి" అనే పదమును చార్టులో చేర్చు. [36]"అవసరతనెరుగుట" అనే పదమును చార్టులో చేర్చు. లూకా 18:9–14లో స్వయం – సంతృప్తి కలిగిన మనిషిని మరియు ఆత్మసంబంధమైన అవసరతను ఎరిగినవారిని గూర్చి తెలుపుతుంది. [37]కొర్నేలీ యొక్క మార్పును గూర్చి "నశించిపోయిన ఒక మంచి మనిషి" అనే పాఠమును "కార్య గ్రంథం, 2" చూడు. [38]"ప్రవేశించుటకు గాను" అనే పదమును చార్టులో ఉంచి ఒక బాణము గుర్తును "రాజ్యము" అనే పదము వైపు చూపుము. [39]"దేవుని పిల్లలు" అగుట అనగానేమో "క్రీస్తు జీవితం, 4"లోని వివరణను రివ్యూ చేయి. [40]"మార్పు" అనే పదాన్ని చార్టులో చేర్చు.

[41]"బాప్తిస్మము" అనే పదాన్ని చార్టులో చేర్చు. [42]"నీటి మూలముగా జన్మించుట" అనేది బాప్తిస్మమును సూచిస్తుంది అనే వాత్సవం పై క్లుప్తమైన చర్చకు "క్రీస్తు జీవితం, 1"ను చూడు. క్రొత్త జన్మ పై యేసు ఉపదేశము కొరకు the outline "It Starts With a Birth" in "Getting Serious About Love, 2," *Truth for Today* (March 1990), 42-50 చూడు. [43]1 కొరింథీ. 12:13లోని బాప్తిస్మము గ్రేట్ కమిషన్‌లోని బాప్తిస్మము, ఎఫెసీ. 4:5లో చెప్పబడిన ఒకే బాప్తిస్మము, నీటి బాప్తిస్మము. మనము ఆత్మచే (నడిపింపబడిన వాక్యము ద్వారా) సంఘము అను ఒక్క శరీరములోనికి బాప్తిస్మము పొందినవారమై యున్నాము. [44]"మరొక చోటికి మార్పు" అనే పదాన్ని చార్టులో చేర్చు. [45]నీ శ్రోతలకు అవసరమైనదాన్ని వివరించు. [46]పౌలు ప్రసంగం వలన అగ్రిప్ప స్పదించాడా లేదా అనే చర్చకొరకు "కార్య గ్రంథం, 5"ను చూడు. [47]క్రింద అక్షరాలలో కన్పించే 37వ వచనానికి సంబంధించి, "కార్య గ్రంథం, 2" చూడు.

## “రాజ్యమునకు నీవు దూరముగా లేవు”

### దూరము

అకారణ ద్వేషము
దుష్టత్వం
ఉపదేశం లేకపోవడం
స్వయం - సంతృప్తి

### ప్రవేశించుటకు గాను

మార్పు
బాప్తిస్మము
మరొక చోటికి మార్పు

### దగ్గర

యథార్థ హృదయం
మంచి, నైతిక జీవితం
నేర్చుకోవాలనే ఆత్రుత
అవసరతనెరుగుట

→

**రాజ్యములో**
**సంఘములో**
**శరీరములో**
**క్రీస్తులో**

**ఆత్మసంబంధమైన ప్రతి అశీర్వాదము**
విమోచన
రక్షణ
దేవుని పిల్లలు